**వెన్నెల** సిక్‌గా ఉంది!

• • •

''డియర్!

ఎందుకంత ప్రేమ నే నంటే? నాలో ఏం చూశావ్? నీకు నీమీద కన్నా నామీదే ఎక్కువ ప్రేమ అనుకుంటాను. నేను లేకుంటే ఏమైపోయేవాడివో ననిపిస్తుంది. లైలా, జూలియట్, అనార్కలీ, పార్వతి... వీళ్ళందరి ముందూ తలెత్తుకు తిరగ్గల దాన్ని నే నొక్కదాన్నే ననిపిస్తుంది. ఎందుకంటే వాళ్ళంతా నా అంత ప్రేమని పొందారని అనుకోను.

నన్నింతగా ప్రేమించిన నీకు ఏమివ్వగలను, నా రాజా...ఏముంది నా దగ్గర.. ఓహ్ ఎంత పిచ్చిదాన్ని. ఈ పద్దెనిమిదేళ్ళ పరువాన్ని తాంబూలంగా ఇస్తాను. ఏమిటి సిగ్గే! నా పిచ్చీ, నా మొద్దూ! అందుకే నువ్వంటే నాకంత ముద్దు... రేపు సాయంత్రం ఇంటికి రా...ఒక్కదాన్నే ఉంటాను.

నిన్నంతా వెన్నెల నన్ను చూసి ఎంత పిల్లిగా నవ్విందో తెలుసా... మవ్వొచ్చేక దాని పని చెప్దాం.

నీ
సంధ్య.''

మళ్ళీ చదివాడా ఉత్తరాన్ని సుందరం.

అలా చదువుతూనే ఉన్నాడు. ఎంత సేపట్నుంచీ చదువుతున్నాడో, ఎన్ని సార్లు చదివాడో అతనికే తెలీదు.

అప్పటికి బాగా చీకటి పడింది.

హాస్పిటల్ వరండాలో తిరుగుతున్న పేషంట్‌లా చంద్రుడు చాలా సిగ్గా ఉన్నాడు.

అందువల్లనేనేమో...

వెన్నెల సిక్‌గా ఉంది!

సుందరం చుట్టూతా అవే ఉత్తరాలు...అలాంటి ఉత్తరాలు.... ఇంచుమించు అదే భాష. అదే కవ్వింపు. అంతే తెగింపు.

''సంధ్యా...నువ్వేనా ఇలా రాసింది... మరిప్పు డిలా ఎందుకు మారిపోయావు, సంధ్యా...''

సుందరం చేతుల్లో ఉత్తరాలూ, గుండెలో జ్ఞాపకాలూ నలిగిపోతున్నాయి.

ఏదో నిశ్చయానికి వచ్చేసి లేచి నిలబడ్డాడు సుందరం.

''అలా నిలబడతావేం...రా...ఇలా నన్ను అనుకుని నా పక్కన కూర్చో. కూర్చుంటే నేనే నీకన్నా పొడుగు. రమ్మంటూంటే...రావూ!''

'యూ షటప్'

గతాన్ని కసిరాడు!

'నీక్కోపం వస్తే ఎంత ముద్దొస్తావో తెల్సా...కొరుక్కు తినెయ్యాలనిపిస్తుంది నాకు.'

సుందరం గిరుక్కున వెనక్కి తిరిగాడు.

'ఛీ...ఇంకా నమ్ముతానా నీ జాణ కబుర్లు...'

'సుందూ..'

కసురుకున్నా ఒదలడం లేదు

[illegible] తాళం వేసి ధనుర్విముక్త విశిఖంలా రోడ్డున పడ్డాడు.

'అవును. వెళ్తాను. నిలదీసి అడుగుతాను. వద్దు. ఇంత జరిగాక ఇంకా సిగ్గులేకుండా...నో...ఐ మస్ట్ గో.'

వెళ్ళవలసిన దూరం తెలుసు సుందరానికి.

దగ్గర కాని దూరంకాదు కానీ... దగ్గర కాలేకపోయిన దూరం— అయినా వెళ్ళాలి.

అక్కడికి ఆటోలో, లేదా టాక్సీలో వెళ్ళాల్సినంత దూరం. రిక్షాలో అయినా వెళ్ళచ్చు. ఆ ఆలోచనే రాలేదు. నడుస్తున్నాడు.

రక్తం పొంగి కళ్ళల్లోంచి దూరాలని ప్రయత్నిస్తోంది.

నడక వేగం పెంచాడు.

గుండె శబ్దం హెచ్చింది.

అమ్మయ్య...ఎన్నాళ్ళకి, ఎన్నేళ్ళకి... చేరుకోగలిగాడు.

అదిగో పార్క్ పక్క మలుపుకి రతి




గాలి—అంతే.

అరెరే...ఏమిటీ మలుపు జీవితంలో. అణువణువునా ఆరాధించిన సంధ్య ఇలా చేసిందేమిటి!

వెనక్కి వెళ్ళిపోతే...

పోతేమాత్రం వెనకటి రోజులు వస్తాయా?!

ఆ మలుపులోనే కదూ తొలిసారి పరిచయం. ఆ వేప చెట్టుకిందనేకదూ తొలి ముద్దు. గుండె పెదవుల్లోకి వచ్చి ధ్వనిని మార్చుకుని మరీ ముద్ర వేశాయి ఈ పెదవులపైన!

చురుక్కుమన్నాయి పెదవులు.

సిగరెట్ కాలికింద పడేసి నలిపేశాడు.

ఇంతవరకూ పెదాల మధ్య షోగ్గా.. ఇప్పుడు పాదాలకింద హీనంగా...

''ఓహోయ్ పురుషుల్లారా! మీరు మమ్మల్ని కాలిస్తే...ఆడవాళ్ళు మిమ్మల్ని కాలుస్తారు...'' సిగరెట్ బట్ ఆఖరి మూల్గు.

మలుపు వచ్చేసింది.

వేపచెట్టు నీడ విచారంగా పార్క్ తోంది — నేలపైన గుండె బాదుకుంటూ—ఒంటరి సుందరాన్ని చూసి!

అదిగో. ఆ ఇల్లే. ఎంత సేపటికి వచ్చింది. అప్పుడే వచ్చేసిందే!

గేటు ముందర ఆ నాడు సుందరం.

అయిదు నిమిషాలు అవీజీగా అటూ ఇటూ తిరిగాడు.

కాసీ—

అతనొచ్చి అయిదు సెకండ్లయినా కాలేదు.

సుందరం గుండె, గొంతూ అతనిష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాయి. పిచ్చిగా అరిచాడు.

''సంధ్యా!''

• •

ఆ కేకకి ఉలిక్కిపడింది అంత మేడా! లైట్లు వెలిగాయి.

'ఎవర్రా?'
మేడ పొట్లాడదు. ఆ వేళలో కోయిలలు కూయవు.
ఆ గొంతు సంధ్యదే!
వూపిర్ని నిలదీసే అందం సంధ్యది.
సంధ్యని చూసిన వాళ్ళకి కవిత్వం వ్రాయబుద్ధి కాదు. (అతగాడు కాళిదాసైనా, కృష్ణశాస్త్రి అయినా సరే) కౌగిలించుకోవాలనిపిస్తుంది.

• • •

ఏసి రూమ్‌లో ఉన్నా సుందరానికి చెమటల్లు పడుతున్నాయి.
ఒకే ఒక నిమిషం మౌనం.
"సుందరం నువ్వెందుకొచ్చావో నాకు తెల్సు. నీతో ఎక్కువ మాట్లాడే అవకాశం లేదు. ఆయన వొచ్చేస్తారు— వెడ్డింగ్ కార్డ్స్ సెలక్షన్‌కి వెళ్ళాలి. ఆయన్ని నీకు పరిచయం చెయ్యలేదు కదూ ... వైవుడ్ బి ... మిస్టర్ రావ్ పేరు వినే ఉంటావు. పెద్ద బిజినెస్ మాగ్నెట్. కనుక నువ్వు అడగదల్చుకున్న దేమైనా ఉంటే, నన్ను తిట్టాల్సిన తిట్లు — అన్నీ అయిదే అయిదు నిమిషాల్లో ముగించేసి వెళ్ళిపో ... ప్లీజ్"
"నన్ను ... నన్ను ప్రేమించానన్నావ్?"
"అన్నాను."
'మరి?"
"ఇప్పటికీ, ఎప్పటికీ నిన్నే ప్రేమిస్తాను సుందరం."
"అబద్ధం."
సంధ్య చిరునవ్వు నవ్వింది."అలాగే అనుకో. పోనీ, నిన్ను ప్రేమించిన దాన్ని మరొకర్ని పెళ్ళి చేసుకోవడం ఏమిటని కదూ నీ అనుమానం ... చెప్తా ... చూశావా ... నా ప్రాణాలి ప్రాణమైన నువ్వొస్తే టీ అయినా ఇవ్వకుండా నిలబెట్టి మాట్లాడేస్తున్నాను."
· "మాట మార్చకు ..."
"నువ్వంటే నాకు ఆకర్షణ కాదు, సుందరం — అలా అయితే ఆతుక్కుపోయేదాన్ని ... ప్రేమే ... అక్షరాలా ప్రేమే ...అందుకే నీకు దూరం అవుతున్నాను. నేను పుట్టింది, పెరిగింది ఖరీదైన జీవితం ... అందులో అరుదైన ప్రేమని నీ ద్వారా పొందగలిగాను."
సంధ్య కళ్ళు కలువలనివాసాలయ్యాయి
"అయితే నా పిచ్చి సుందరం! బతుకు ప్రేమతోనే తృప్తి పడదు. అంతేక నిన్ను ప్రేమించడంకోసం బతుకుదూ ... బతకడంకోసం అతనితో పెళ్ళి. నా కోర్కెల్ని, నా కష్టాల అవసరాల్నీ భరించడం నీ వల్ల కాదు— ఇలా అంటున్నావని అభిమానపడకు. ఆలోచించు ... నువ్వూ... నీ ప్రేమా, నీ తలపూ అన్నీ తాజాగా ఉండాలి. పాతబడకూడదు. పాడైపోకూడదు..."
"స్టుపిడ్! .. రాక్షసీ ... కామినీ.. పిశాచీ ... చీటర్ ... ఒళ్ళు కొవ్వెక్కి కామంతో ఒంకర్లు తిరిగితే వాతో తిరిగావ్ ... అవసరం తీర్చుకున్నావ్ ... నీ అందం నాకు ఎంచం పెట్టి నా ప్రేమ కాజేసావ్ ... ఇప్పుడు ... డర్టీ బిచ్ .."
పకపకా నవ్వింది సంధ్య.
తను తిట్టిన తిట్లకి ఏడవాల్సిన సంధ్య నవ్వుతుంటే పిచ్చెక్కినట్లయింది సుందరానికి.
సంధ్య నవ్వుతూనే ఉంది.
తెరలు తెరలుగా వస్తున్న నవ్వులోంచి ముత్యాలు రాల్లేదు. ముత్యాల్లాంటి కన్నీళ్ళు రాలాయి.
"అవును సుందరం. నిజంగానే నువ్వన్నది నిజం. నేన్నిన్ను ప్రేమించలేదు. కామించా. చాలా? గెట్ అవుట్... పో ఇక్కడ్నుంచి."
సుందరం కదల్లేదు.
"సుందరం! నన్ను క్షమించు. ఇది పరిస్థితుల ప్రభావం. నేన్నిన్ను ప్రేమిస్తున్నా" అని సంధ్య అనాలనిపించింది సుందరానికి.
"సంధ్యా!"
"వూ"
"సంధ్యా ... మరి నీ ఉత్తరాలకేం సమాధానం చెప్తావ్...అన్నీ అబద్ధాలేనా? న్ను వంచించడానికి రాసినవేనా?"
ప్రళయకాల ఝంఝామారుతంలో చివురు టాకులా వణికి పోయింది సంధ్య మనసు.
బలహీనత.
ప్రేమబలం ఎక్కువైపోతోంది.
ఉద్రేకం ఉనికిని మర్చిపోయేట్లు చేస్తోంది. ఉద్వేగాల్ని మార్చేస్తోంది. అలా జరకూడదు.
"చెప్పు సంధ్యా .."
రెండు క్షణాలు కళ్ళు మూసుకుంది. మూసుకుని నిశ్చయంగా అది—
"అవును!"
కాళ్ళకింద భూమి కదలినట్లు కదిలాడు సుందరం.
డోర్ తెరిచాడు.
ఏసి రూమ్‌లోకి వేడిగాలులు వచ్చేశాయి.
"సుందూ ... క్షణమంటే క్షణం ఆగు. నువ్వు నిజంగా నన్ను ప్రేమించి ఉంటే ఇన్ని మాటలు అనగలిగేవాడివేనా? చెప్పు ..."
"ఛీ .."
తలుపు మెత్తగా మూసుకుంది!

• • •

వెన్నెల కాస్టిల్‌గా ఉంది.
కంఫర్టబుల్‌గా ఉన్న భవంతిపైన ఆరుబయల్లో —
రావ్ ... మిస్టర్ సి. కె. రావ్
కౌగిట్లో
సంధ్య!
ముదురు గులాబీలా ఉంది.
అయినా ముద్దొస్తూనే ఉంది!
రావ్ ఛాతీపైన ఒరిగి, ఛాతీపైన ఒత్తుగా పెరిగిన వెంట్రుకల్ని సమురాయిస్తూ అంటోంది, "రావ్ ... నీ దగ్గరేమైనా మేజిక్ ఉందా? కాలు బైట పెట్టవ్... హౌ డిడ్ యూ మేనేజ్ మనీ? నీ మనీ ప్లాంట్‌గానీ నాకు తెలీకుండా డబ్బు కాస్తోందా?"
రావ్ నవ్వాడు.
"చెప్తాను."
"అర్ధాంగిని కదోయ్."
"డేర్ యూ ఆర్ ... అర్ధాంగివని కనుకునే అసలు చెప్తాను. నువ్వు బాధపడి, నన్నూ బాధపెడ్తావ్ ..."
చంకల మధ్యగా తన పీకని చుట్టేసిన రావ్ చేతుల్ని విడిపించుకుంది సంధ్య.
"ఏదేం ..."
"ఇవాళ్టికి వస్తే ..."
కంగారుగా సంధ్యని మీదకి లాక్కున్నాడు, "ఆ మాట అనకు."
"అయితే చెప్పండి."
"బాధపడవుగా."
"ఊహుఁ."
"ఓ. కే. విను. నా కాలేజీ రోజుల్లో ఒక మిలియనీర్ ముద్దుల డాటర్ ... వొన్లీ డాటర్ ... ఈ స్పోర్ట్స్‌మన్ని లవ్వాడింది. తన కవిత్వపు పైత్యాన్ని రంగరించి ప్రేమలేఖలా వ్రాసింది— చివరకు నన్ను చీట్ చేసి ఎవడో వాళ్ళ అంతస్తుని మించిన వాడిని పెళ్ళిచేసుకుంది. నాలో ప్రేమ పగగా మారింది."
సంధ్య భ్రుకుటి బిగుసుకుంది.
"అంతే! ఆ తర్వాత లోకం అంతా లవ్ కాదు—లౌక్యం అని తెలుసుకున్నా... అప్పట్నించీ ఆ అనుమానపు మొగుడి భార్యకి — ఐ మీన్— నా ఎక్స్ లవర్‌కి ఒక్కొక్క ఉత్తరం ... ప్రణయ లేఖ... కానుకగా పంపిస్తున్నా — నాకు కావల్సినంత డబ్బు ఆవిడ పంపిస్తూంటుంది." ఆకాశంలోకి చూస్తూ అన్నాడు రావ్.
అతనికి వెన్నెల కమర్షియల్‌గా ఉంది.
సంధ్య గుండెని గతం క్రష్ చేసింది.
తన కథా... తన కథే!
"సుందరం! సాధిస్తున్నావా ..."
సంధ్యకి వెన్నెల వెన్నెల్లా కాక కన్నింగ్‌గా ఉన్నట్లు తోచింది.
"అదిగో... నువ్వు బాధపడుతున్నావ్. అందుకే నీకు చెప్ప నన్నాను. జస్ట్ పగ ... పగ తీర్చుకుంటున్నా నంతే!"
ఎలాంటి పరిస్థితిలోనైనా నవ్వడం చేతనవును సంధ్యకి. నవ్వింది. నవ్వుతూ అంది—"ఛీ ... అదేం కాదోయ్ .. నీ తెలివికి అబ్బుర పడుతున్నా ..."

• • •

అన్యమనస్కంగా రావ్‌ని తృప్తిపరచి, నిద్రపుచ్చి, తన రూమ్‌లోకి వచ్చింది.
చుట్టూతా బీరువాలు.
అన్నింటి నిండా తన పెళ్ళికి వచ్చిన కానుకలు!
గబగబా అన్నీ వెతికింది.
దుమ్ము పట్టింది. ఆరేళ్ళ క్రితం గుర్తులు కదా!
అందులో తను వెదుకుతున్న కవర్ దొరికింది.
ఆ అక్షరాలు ... ఆ దస్తూరి ... సంధ్యలో బిపి రైజ్ అయింది. ఆత్రంగా వోపెన్ చేసింది కవర్‌ని.
అన్నీ ప్రేమ లేఖలు ..
తను సుందరానికి రాసినవి.
వాటిల్లోంచి వో స్లిప్ జారిపడింది.
దాని మీద—
"పేదవాడి ప్రేమ కానుకలు ... సుందరం —"
అని మాత్రం ఉంది.
చివుక్కు మన్న మనసు కళ్ళలో కదిలింది సంధ్యకి.
వూపిరి తేలిగ్గా ఎగిరింది.
"సుందరం ... భయపడకుండా నేను బతకడంకోసం నువ్వు పంపించిన కానుకలు .... నా పెళ్ళినాడు ఎంత నిర్లక్ష్యంగా అవతల పడేశా ఈ కవర్ని ... వోహో నువ్వు నన్ను నిజంగా ప్రేమించావ్ సుందూ ... అందుకే నన్ను క్షమించావ్ ... కాదు రక్షించావ్ ..."
అనుకొని వాటన్నింటినీ తగలబెట్టి బైటికి వచ్చిన సంధ్యకి —
సుందరంలా కమనీయంగా, ఆహ్లాదంగా ఉంది వెన్నెల.

• • •

అప్పుడు ...
సుందరానికి ...
వెన్నెలే లేదు! ★